"అప్పగించాం...."

ద్విభాష్యం రాజేశ్వరరావు

"మిమ్మల్ని ఆ బ్రహ్మదేవుడు కూడా మార్చ లేడు!..." అన్నపూర్ణమ్మగారు గొణుక్కుంటూ పోపు గరిటె చారుగిన్నెలో ముంచి చుయ్ మనిపించేరు.

ఆ శబ్దంలో కూడా ఆవిడ గొణుగుడు ముద్దుకృష్ణయ్యగారి చెవిని స్పష్టంగా పడింది. చారుకు తిరగమోత పెడుతూవుంటే వచ్చే ఆ శబ్దం ఆయనకు ఎంతో ఇష్టం! అన్నపూర్ణమ్మగారి సణుగుడు మరీ ఇష్టం !!

వంటింట్లోంచి బయటకు వచ్చేస్తున్న మనిషల్లా — ఆగిపోయి — వెనక్కువెళ్ళి ''ఈవేళ శాకపాకాలు ఏమిటో చెప్పేవుకాదు.. '' అన్నారు చిన్నగా నవ్వుతూ.

చారుగిన్నెమీద మూతపెడుతూ కాస్త నిరసనగా ఆయనవంక చూసింది ఆవిడ.

''ఏముంది ? రోజూలాగే పంచభక్ష్య పరమాన్నాలు ! దోసకాయపప్పు చేశాను ! ముక్కలపులుసు ! అందులోకి మీ కిష్టమని నాలుగు అప్పడాలు కాల్చేను ! ఆవకాయ, గోంగూరపచ్చడీ, దబ్బకాయ పొక్కెంపూ ఎలాగూ ఇంట్లో వుండనేవున్నాయి ! నిన్న బొబ్బట్లు వండేనుకదా, అందుకని ఈవేళ గారెలు వండుతున్నాను ! అన్నట్టు మరిచిపోయాను, 'ఆ కాకరకాయ' కూరంటే మీకు ప్రాణం కదా ! అందుకని వాటిని చక్రాల్లా తరిగి నేతిలో వేయించాను. చాలా !'' అంది తడిచేతులు కొంగుతో అద్దుకుంటూ.

ఆమె మాటల్లోని ఎగతాళి ఆయనకు అర్ధమయింది. రెండు క్షణాలపాటు ఆవిడవంక కన్నార్పకుండా చూస్తూ వుండిపోయారు.

గుండ్రని ముఖం, కలువరేకుల్లా పెద్ద కళ్ళు, విశాలమయిన నుదుటన పెద్దకానీ సైజులో కుంకుమబొట్టు ! తలమీద వెండి తీగల్లా మెరిసి తళుక్కుమంటున్న కురులు ! ఆమె చూపుల్లో క్షణకాలం నిరసన, ఆ వెనుకనే ఆప్యాయత ! మాటల్లో ఆర్ద్రత, మందలింపు అన్నీ వున్నాయి !

''రోజురోజుకీ మీరు చిన్నకుర్రాడిలా తయారవుతున్నారు. ఇంకా తెల్లారి తొమ్మిదిన్నర అయినా కాలేదు. అప్పుడే వంటింట్లోకి మూడుసార్లు తొంగిచూసి వెళ్ళేరు. ఆకలికి కాస్త ఆగలేకపోతే ఎలాగ ? కోడలు స్నానానికి వెళ్ళింది. వచ్చి చూస్తే సణుక్కుంటుంది...'' అన్నారు అన్నపూర్ణమ్మగారు మందలింపు ధోరణిలో ! ఈ మాటలు పట్టించుకోనట్లు ''ఈవేళ కూర వండలేదా పూర్ణా ? '' అన్నారు.

''వండలేదండీ ! ప్రతి పూటా కూర కావాలంటే ఎలాగ ? మార్కెట్లో కూరల ధరలు మండిపోతున్నాయి. ఆఖరికి పుచ్చు వంకాయలు కూడా కిలో మూడు రూపాయలు పెడితేగాని దొరకటంలేదు. నిన్న రఘు ఆఫీసుకు వెళ్లేటప్పుడు కూరల గురించి జ్ఞాపకం చేశాను. సాయంకాలం వట్టి చేతులతోనే చక్కా వచ్చేడు. మరీ రొక్కించి అడిగితే బాధ పడతాడని ఊరుకున్నాను. నెలాఖరు రోజులు ! వాడికీ ఏవో ఖర్చులుంటాయి కదా ! ఈవేళ ఆవకాయ, మజ్జిగ వేసుకుని తిని ఆఫీసుకు వెళ్ళిపోయాడు. నా పూజ ఆలస్యం అవటంతో పిచ్చి కుంకకి చారయినా చేసిపెట్టలేకపోయాను.'' మాటలు ఆపి కళ్ళు ఒత్తుకుంది అన్నపూర్ణమ్మగారు.

ముద్దుకృష్ణయ్యగారు మౌనంగా బయటకు వచ్చేసి వీధి వరండాలోని పడక్కుర్చీలో వాలిపోయారు.

వేసవికాలం ఎండ చిక్కబడుతోంది ! గాలి ఎక్కువగా ఆడకపోవటం వలన చికాగ్గావుంది ! ఎదురింటి వేపచెట్టు మీద వాలిన కాకి అదేపనిగా అరుస్తూ గోల చేస్తోంది.

ఆయనకు కడుపులో మంట ప్రారంభమవుతోంది సన్నగా !

దాని పేరు ఆకలి అని ఆయనకు స్పష్టంగా తెలుసు ! బలంగా కళ్ళు మూసుకున్నారు రెండు క్షణాలు !

''హాయ్ ! తాతయ్యా ! '' అన్న పిలుపు విని కళ్ళు విప్పేరు.

ఎదురుగా ఆరేళ్ల ఇందుమతి !

''ఇందూ! అప్పుడే బడి వదలిపెట్టేశారా?'' అంటూ మనవరాల్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు.

''ఈవేళ ఆఖరి పీరియడ్ మాస్టారు రాలేదు. అందుకని తొందరగా వదిలేశారు ! తాతయ్య ! నువ్వు ఇంకా బువ్వ తినలేదా ?'' అంది ఆయన కడుపు తడిమి చూస్తూ.

''ఇంకా లేదమ్మా ! నువ్వు వస్తే ఇద్దరం కలిసి తిందామని చూస్తున్నాను. లోపలకు వెళ్ళి మనిద్దరికీ అన్నం వడ్డించమని చెప్పు ! '' అన్నారు మనమరాలిని బుజ్జగిస్తూ.

తాతయ్య ఒడిలోనే పుస్తకాల సంచీ వదిలేసి లోనికి పరుగెత్తింది ఇందు !

పదినిమిషాలలో వంటింట్లోంచి పిలుపు వచ్చింది.

అడ్డాకు ముందు పీట మీద కూర్చున్న ముద్దుకృష్ణయ్యగారు రెండు నిమిషాలు కనులు మూసుకుని గాయత్రి జపించి కనులు తెరిచేసరికి ఎదురుగా విస్తట్లో అన్నం, ఆవకాయ, ఉసిరికాయ పచ్చడి మాత్రం కనుపించేయి. సగం ఆకలి చచ్చిపోయింది ఆయనకు.

అన్నపూర్ణమ్మగారు చిన్న గరిటెతో పప్పు తెచ్చి ఇందు విస్తట్లో వడ్డిస్తూ ''ఈ నాపసానికి పప్పంటేగాని ముద్ద దిగదు. నాలుగు బద్దలు మిగిలితే దీని కోసమని ఉడకేశాను'' అని గదిలో జడవేసుకుంటున్న కోడలికి వినిపించేలా గట్టిగా అని ఇటూ అటూ చూసి వెళ్ళిపోతూ గరిట్లో మిగిల్చిన సగం పప్పు భర్త విస్తట్లో అన్నంమీద విదిలించి లోనికి చక్కాపోయింది. కోడలు కంటపడుతుందనే భయంతో గబగబా దాన్ని కలిపి ఆబగా నాలుగు ముద్దలు నోట్లో కూరుకున్నారు ముద్దుకృష్ణయ్యగారు !

కోడలు జడవేసుకుని తలలో పిన్నులు సర్దుకుంటూ వంటింటివైపుకు వచ్చింది, ''అత్తయ్యా ! బియ్యం ఒకటో తారీఖువరకూ వస్తాయా ?'' అంటూ.

''రావు ! రెండు రోజుల్లో తెచ్చుకోవాలమ్మా !'' అన్నారు అన్నపూర్ణమ్మగారు.

''ఏవిటీ ? నలభై కేజీలూ ఇరవై మూడు రోజుల్లోనే అయిపోతున్నాయా ? ... ఇంట్లో అందరివీ పిట్టతిళ్ళే ! ... మరి ఎలా అయిపోతున్నాయో అర్ధం కావటంలేదు ! ... గుంటముండా ! ... అన్నం కలుపుకుని తినక నా వంక గుడ్లు మిటకరించి చూస్తావేం ?'' అంటూ ఇందుని ఒక్క కసురు కసిరి గదిలోకి వెళ్ళిపోయింది ఆమె.

ముద్దుకృష్ణయ్యగారు తలవంచుకుని గబగబా తినటం ఆరంభించేరు. కంట్లో తిరిగిన నీటిబిందువు క్రింద రాలిపడకుండా పండిన గుబురు మీసాల సందున చిక్కడిపోయింది.

* * *

మరునాడు ఉదయం ఇందుని వీధివరండాలో కూర్చోబెట్టుకుని తెలుగు పుస్తకంలోని పద్యాలు వల్లెవేయిస్తున్నారు. కోడలుపిల్ల పక్కింటికి బాతాఖానీకి వెళ్ళింది. అన్నపూర్ణమ్మగారు బయటకువచ్చి ద్వారాన్ని ఆనుకొని నిలబడి నవ్వుతూ అడిగేరు.



"పదిగంటలయిపోతోంది, అయ్యగారు ఈవేళ శాకపాకాలు అడగలేదేం ?"

మెల్లగా పుస్తకంలోంచి తలఎత్తి విరిగి పోయిన కళ్ళజోడు అద్దాల్లోంచి ఆమె వంక చూశారు.

తరువాత "ఏమిటీ కథ ?" అన్నారు కుతూహలంగా.

"నిన్న సాయంకాలం మన పక్కింటి పార్వతమ్మగారు కొంచెం ఆకాకరకాయలు పంపించారు. మీకు ఆకాకరకాయ వేపుడంటే చాలా ఇష్టమని ఎప్పుడో ఆవిడతో మాటల సందర్భంలో అన్నాను. అది గుర్తుపెట్టుకొని ఓ పదికాయలు పంపేరు. ఎలాగూ కోడలూ, రఘూ ఇద్దరూ ఆ కూర తినరు. ప్రత్యేకంగా మీ కోసమే ఈ వేళ చేస్తున్నాను. ఒక్క పావుగంటలో వంటయిపోతుంది" అన్నారు.

ముద్దుకృష్ణయ్యగారి ముఖంలో ఆనందం వీచికలా కదిలింది.

"ఇంతసేపు చెప్పవేం మరి ? తొందరగా వంటకానీయ్ ! ఆఖరున చిన్న వెల్లుల్లి కారం తగిలించటం మరిచిపోకు ! ఆ కారం తగిలిస్తే ఆ మజాయే వేరు !! దోరగా వేయించు ! మరీ మాడ్చిపారెయ్యకు ! " అన్నారు హుషారుగా.

ఆకాకరకాయ వేపుడు సంగతి చెప్పేసరికి భర్తలో కలిగిన హుషారు చూసేసరికి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది అన్నపూర్ణమ్మగార్కి ! మెల్లగా వంటింట్లోకి కదిలిపోయారు ఆవిడ!

"తాతయ్యా ! ఆకాకరకాయలా? అవేంటి? కూర వండుకుంటారా ?" అంది ఇందు చక్రాల్లా కళ్ళు తిప్పుతూ.

"ఓసి పిచ్చితల్లీ ! ఆకాకరకాయలు చూడ లేదూ ? కూర భలే రుచిగా వుంటుందిలే ! వేగిన తరువాత అందులో గింజలు జీడిపప్పుకన్నా రుచిగా వుంటాయి ! కాస్త బెల్లం తగిలించి వండితే ఆ రుచి అద్భుతం !... నువ్వు పెళ్ళిచేసుకున్నాక ఈ తాతయ్య నిన్ను చూడ్డానికివస్తాడు కదా మీ ఇంటికి... అప్పుడు రెండు పూటలా నువ్వు ఆకాకరకాయలే వండిపెట్టాలి !"అంటూ ఇందూ వంక ఆప్యాయంగా చూసేరు.

"ఛీ ! నాకు పెళ్ళి వద్దు !" అంటూ చదువుతున్న పుస్తకం తాతయ్య ఒళ్ళోకి విసిరేసి ఇంట్లోకి తుర్రుమంది.

వెళ్ళిపోతున్న ఇందూ వంక చూసి తృప్తిగా నవ్వుకున్నారాయన !

"నాన్నా ! ఎవరొచ్చారో చూడు !" రఘు మాటలతో వీధివంక చూశారు. మెట్ల దగ్గర నిలబడి చిరునవ్వు నవ్వుతున్న వ్యక్తివంక రెండు నిమిషాలు సందేహంగా చూస్తూ వుండిపోయారు.

"శంకరం నాన్నా ! అనకాపల్లిలో మనం వేదులవారి వీధిలో వుండేటప్పుడు మనపక్కింట్లో వుండేవాడు కదా ! పోస్టుమేస్టారి అబ్బాయి !" అంటూ రఘు వివరాలు అందించేడు.

అప్రతిహతాం

ముద్దుకృష్ణయ్యగారు కుర్చీలోంచి లేస్తూ "నువ్వా శంకరం ! ఎంత ఎదిగిపోయావ్ ? రా బాబూ !" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించేరు.

"ఇప్పుడు శంకరం పెద్ద ఆఫీసరు నాన్నా ! ఇన్సూరెన్సులో పనిచేస్తున్నాడు ! ఒరిస్సాలో వుంటున్నాడట ! ఈ వూరొచ్చి మనింటికి రాకుండా వెళ్ళిపోదామనుకున్నాడు. దారిలో కనిపిస్తే బలవంతంగా తీసుకువచ్చాను !" అని శంకరంవైపు తిరిగి "నాన్నగారితో కబుర్లు చెపుతూవుండు ! పది నిమిషాల్లో భోజనం ఏర్పాట్లు చేయిస్తాను !" అన్నాడు. "అమ్మా ! పోస్టుమేస్టారి అబ్బాయి శంకరం వచ్చాడు !" అంటూ లోనికి వెళ్ళేడు.

వంటింట్లోకి వెళ్ళ తల్లి వేయిస్తున్న ఆ కాకరకాయ వేపుడువంక చూసి దీర్ఘంగా నిట్టూర్చి "రక్షించావు ! శంకరం కనబడితే భోజనానికి తీసుకువచ్చాను ! కనీసం కూరయినా లేదేమోనని భయపడ్డాను ! భోజనం చేసి మెయిలుకు వెళ్ళిపోతాడువాడు !" అన్నాడు రఘు మెల్లగా.

కొరకాసు

ఏ కొరతాలేని
జిగేలు మనిపించే
వొంటిబిగి
కొసదాకా కాలిన కొరకాసు,
కాయం కట్టెనిండా
కణకణమనే బూది !

— నిఖిల్

"అలాగే బాబూ ! వడ్డించేస్తాను !" అంది ఆవిడ.

పావుగంట తిరక్కుండా విస్తరివేసి శంకరానికి వడ్డించేరు అన్నపూర్ణమ్మగారు.

రఘు శంకరం పక్కనే పీట వేసుకుని కూర్చుని కబుర్లు ఆరంభించేడు.

ముద్దుకృష్ణయ్యగారు వంటింటి గడప అవతల నిలబడి శంకరం కుటుంబ వ్యవహారాలన్నీ అడిగి తెలుసుకుంటున్నారు.

"మొహమాటపడకుండా తినుబాబూ " అంటూ ఆప్యాయంగా వడ్డిస్తోంది అన్నపూర్ణమ్మగారు.

"ఆకాకరకాయ వేపుడు బ్రహ్మాండంగా వుందండీ ! నిజంగా ఈ వేళ జిహ్వ లేచి వచ్చింది. మాకు 'తాల్చేరు'లో ఈ కూర దొరకదు ! మా అమ్మగారి చేతి వంట జ్ఞప్తికి వస్తోంది నాకు !" అన్నాడు శంకరం తృప్తిగా తింటూ.

"ఎంతమాట బాబూ ! ఇంకొంచెం వేసుకో !" అంటూ వేయించిన మూకుడులోని ఆఖరి ముక్కలుకూడా తీసుకువచ్చి శంకరం విస్తట్లో వడ్డించారు. ఖాళీ అయిపోయిన మూకుడువంకా, అన్నపూర్ణమ్మగారి ముఖంవంకా మార్చి మార్చి చూసేడు ముద్దుకృష్ణయ్యగారు.

రెండూ నల్లగానే కనుపించేయి ఆయనకు !

ఆయన ముఖంలో నెత్తురు మాయమవటం మాత్రం స్పష్టంగా గమనించింది, కేవలం ఒక్క అన్నపూర్ణమ్మగారు మాత్రమే ! !

* * *

ఉదయం ఏడు గంటలయ్యేసరికి బట్టలు వేసుకుని తెమిలి పోయిన రఘు వంక చూస్తూ "ఈవేళ ఇంత తొందరగా తయారయిపోయావేమిటి ? " అన్నారు ముద్దుకృష్ణయ్యగారు.

"శంకర మఠంలో మా బాబాయి కూతురు పెళ్ళి ఈవేళ ! " అంటూ కోడలు పిల్ల గది లోంచి బయటకు వచ్చింది. ఆమె అప్పుడే చీర సింగారించుకుని ముస్తాబయి పోయింది.

"ఎవరు ? నర్సింహం కూతురికే ! " అన్నారు ఆనందంతో.

"అవును మావయ్యా ! పదింటికి పెళ్ళి ! భోజనాలు చేసి సాయంకాలం వచ్చేస్తాం ... ఈవేళ సెలవు పెట్టేశారు ఆయన ! " అంది.

పెళ్ళి భోజనం అనగానే పులిహోర, బూర్లు, అరటికాయ ఉప్మాకూర, వంకాయ [illegible]కూర, పప్పు, నెయ్యి, ముక్కల పులుసు, మిఠాయి, అరిసెలు, బూందీ అన్నీ వరసగా కళ్ళముందు మెదిలేయి ఆయనకి ! ఆకాకరకాయ కూర కూడా చేస్తారేమో ! వాళ్ళు బాగా డబ్బున్న వాళ్ళే ! ఆకాకరకాయ వేపుడు వడ్డించినా ఆశ్చర్యపోనక్కరలేదు ! తను లాంటి దరిద్రులు కాదు వాళ్ళు !

ఆయనకు ఏ మూలనో పేగుల్లో కదలిక ఆరంభ మయింది !

మామగారి పేగుల్లోని కదలికను అవలించకుండానే చూడగలదు కోడలు !

"నేనూ, ఆయనా, ఇందూ ముగ్గురం వెళ్ళొస్తాం ! మీరూ, అత్తగారూ కాస్త ఇంటిని కనిపెట్టుకుని వుండండి ! "అంటూ మామగార్ని మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా "ఇందూ ! అలా గౌను మాపుకోకు ! పెళ్ళికి వెళ్తున్నాం కదా ! " అని బయలుదేరదీసింది. రఘు తల దించుకుని "వెళ్ళొస్తాం నాన్నా ! " అంటూ కదిలి పోయాడు ! కోడలు పిల్ల వాడి చూపులు, వాడి నోరు నొక్కేస్తాయని ఆయనకు తెలుసు !

వాళ్ళు ముగ్గురూ సాగిపోయిన వంకే రెండు క్షణాలు తదేకంగా చూస్తూ వుండి పోయారు. దీర్ఘంగా నిట్టూర్పు వదలి ప్రక్కకు చూస్తే

గుమ్మం దగ్గర నిలబడ్డ అన్నపూర్ణమ్మ గారు కనుపించేరు.

"పూర్ణా ! చూశావా ? పెళ్లికి వెళ్తూ కనీసం మనల్ని రమ్మని కూడా పిలవలేదు !" అన్నారు.

"మీకు మరీ చాదస్తం ! వాళ్లతో మన మెందుకు ?" అన్నారు నిర్లిప్తంగా.

"అది కాదు పూర్ణా ! కనీసం ఈవేళయినా కడుపునిండా తృప్తిగా భోజనం చేసేవాణ్ని కదా !..." ఆ మాటలు అంటూంటే ఆయన కంఠం వణికింది !

తరువాత కళ్ళు మూసుకుని కుర్చీలో వాలి పోయారాయన !

గుండెల్లో అనిర్వచనీయమయిన బాధ పీచికలా కదలింది !

రెండు నిముషాల తర్వాత అన్నపూర్ణమ్మ గారు ఆయన దగ్గరకు మెల్లగావచ్చేరు.

తన గుప్పెట్లో నలిగిపోయిన రెండు రూపాయల నోటును ఆయన చేతిలో వుంచుతూ "మార్కెట్టుకు వెళ్ళి ఈ రెండు రూపాయిలతో ఆకాకరకాయలు కొని తెచ్చుకోండి ! పావుకేజీ కాయలు రాకపోవు ! మొన్న మీ నోటిదగ్గర కూర ఆ శంకరానికి వడ్డించవలసి వచ్చింది ! ఒక గరిటెడు వెన్న రహస్యంగా జాగ్రత్త చేశాను. నెయ్యికాచి దానితో మీకు వేపుడు చేసి పెడతాను. కోడలుపిల్ల ఇంట్లో లేదు కదా !..." అన్నారు ఆవిడ.

ముద్దుకృష్ణయ్యగారి కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. "పూర్ణా !..." అని మాత్రం అనగలిగేరు. తరువాత ఆయన కంఠం పూడుకు పోయింది !

వెన్నపూస కాగి ఘుమఘుమ లాడింది. ఆకాకరకాయల్ని చక్రాల్లా గుండ్రంగా తరిగి నేతితో వేయించారు అన్నపూర్ణమ్మగారు ! వంట చేస్తూవుంటే ఆవిడకే నోరు వూరింది. అయిదు సంవత్సరాల క్రితం ఎప్పుడో ఒకసారి ఇలా నేతితో ఒక పండగనాడు ఈ కూర వండినట్లు జ్ఞాపకం.

అప్రణిహితాం

మళ్ళీ కుదరనే లేదు ! ఆయనకు తిండంటే ప్రాణం! అన్ని రుచులూ కావాలి ! అందునా ఈ కూరంటే మరీ ప్రాణం ! చాలీ చాలని జీతపు రాళ్ళతో బతుకీడుస్తున్న కొడుకు పంచన ముద్దుకృష్ణయ్యగారి జిహ్వ రోజు రోజుకూ చచ్చిపోతోందని ఆవిడకు తెలుసును ! కాని, ఏం చేయటం ?!

ఇన్నాళ్ళకయినా మళ్ళీ ఈ రకంగా చేసి భర్తకు వడ్డించగలుగుతున్నందుకు గుండెలనిండా తృప్తిగా అనిపించింది ఆవిడకు.

వంటింట్లో పీటవాల్చి, ఆకువేసి మంచి నీళ్ళ చెంబు, గ్లాసు సర్దేరు ఆవిడ !

"లేచి, కాళ్ళు కడుక్కోండి !" అంటూ వంటింట్లోంచే కేకపెట్టేరు. ఎప్పటికీ భర్త నుండి సమాధానం రాకపోయేసరికి వీధి వరండా లోకి ఆత్రుతగా వచ్చేరు.

వరండాలో పడక్కుర్చీలో ముద్దుకృష్ణయ్య గారు పడుక్కుని వున్నారు. ఆ య న కళ్ళు మూతలు పడివున్నాయి...

* * *

"శ్రార్ధార్ధా సంపాదితా పదార్థాం...దేశతః కాలతశ్చా... శ్రార్ధ యోగ్యం ముఖ్యా..." పురోహితుడు మంత్రం చదువుతున్నాడు.

రఘు నిష్ఠతో తద్దినం పెడుతున్నాడు.

బ్రాహ్మలిద్దరు తద్దినపు భోక్తలుగా ఒకరు ఉత్తర దిక్కుకు, మరొకరు తూర్పు దిక్కును అభిముఖులయి కూర్చుని వున్నారు.

"బాబూ ! ఈ 'కూర్చ'తో ఉదకం భోక్త చేతులుమీద కొట్టి, తరువాత ఈ దర్భతో కలిపి నువ్వులు వారి విస్తరి దగ్గర ధారపొయ్యి! ధార పడేటపుడు కుడిచేతి బొటనవేలు కుడి పక్కగా వంచి ధారపొయ్యాలి !..." అంటూ వివరణ ఇస్తున్నాడు పురోహితుడు.

రఘు "స్వాగతం" అంటూ పితృదేవతల్ని ఆహ్వానించేడు.

హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఇటీవల మానస ఆర్ట్ థియేటర్స్ తృతీయ వార్షికోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రముఖ సినీనటి జయసుధ. సంస్థ కార్యదర్శి శ్రీ రఘుశ్రీ తదితరులని కూడా చిత్రంలో చూడవచ్చు.

పురోహితుడు వల్లిస్తున్న మంత్రం ఆపి భోక్తలవంక చూస్తూ "అయ్యా ! వీరి తండ్రి గారు ముద్దుకృష్ణయ్యగారు మంచి భోజన ప్రియులు! మీరు కడుపునిండా హాయిగా తృప్తిగా తినండి !... ప్రస్తుతం వారి తండ్రిగారు మిమ్మలను ఆవహించియున్నారు కనుక మీరు తృప్తిగా తింటే వారు తృప్తిగా తిన్నంత సంతోషం !..." అంటూ యధావిధిని తాను చెప్పాల్సిన నాలుగు మాటలూ చెప్పి దర్భలు చీల్చి కట్టలు కట్టటంలో నిమగ్నమయ్యాడు.

భోక్తలిద్దరూ పావుగంటలో భోజనం ముగించి తృప్తిగా కడుపులు తడుముకున్నారు. ఇద్దరి ఆకుల్లోనూ ఆకాకరకాయకూర మాత్రం మిగిలిపోయింది !

రఘు మతిపోయినట్లు భోక్తల వంక చూశాడు. తరువాత మెల్లగా అన్నాడు "ఇద్దరూ ఆ కూర తినలేదే ?"

"మేమిద్దరం క్రితం సంవత్సరం తీర్థ యాత్రలకు వెళ్ళినపుడు కూడబలుక్కుని గయలో ఈ కూరను వదిలేశాం !" అన్నాడొకాయన.

"ఇది దొరకడం అరుదు ! అందునా విపరీతమయిన ఖరీదు ! అందుకని దీన్ని వదిలేశాం !" అన్నారు మరో భోక్త !

వంటింటి గుమ్మం దగ్గర నిలబడి వాళ్ళ మాటలు వింటున్న అన్నపూర్ణమ్మగారు చీర కొంగుతో కళ్ళు ఒత్తుకున్నారు !!! ★